రైతులు లేకుండానే నీటి సంఘాల ఎన్నికలు

- కూటమి నేతల కనుసన్నల్లో ఎన్నికలు
- ఓటు వేయడానికి ముందుకు రాని రైతులు
- ఏకగ్రీవ ప్రకటన

పెనమలూరు: మండల పరిధిలో నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల్లో రైతులు కనబడలేదు. కేవలం టీడీపీ నేతలు సిఫార్సులతో ఎన్నికలను ఏకపక్షంగా తూతూ మంత్రంగా అధికారులు నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో టీడీపీ నేతలు హల్‌చల్ చేసినా అధికారులు ప్రేక్షక పాత్ర పోషించారు. మండల పరిధిలో శనివారం వణుకూరు, పోరంకి, తాడిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఈ ఎన్నికలు బహిష్కరించింది. అయితే కూటమి నేతలు పంటలు సాగు చేసే రైతులను ప్రోత్సహించకుండా తమ అనుచరులను రంగంలోకి దించారు. దీంతో రైతులు ఎన్నికల్లో పోటీ చేయడానికి ముందుకు రాలేదు.

పోరంకిలో వాగ్వాదం

కాగా పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రైతు ముప్పాళ్ల బద్రీనారాయణ, ఎంపీడీవో బండి ప్రణవి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. తాను ఎన్నికల్లో పోటీ చేస్తానంటే అధికారులు సహకరించడం లేదని బద్రీనారాయణ ఆరోపించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

కాగా మండల పరిధిలో వణుకూరు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా కొల్లి వెంకటకృష్ణారావు, ఉపాధ్యక్షుడిగా మరీదు రామచంద్రరావు, పోరంకి సంఘానికి అధ్యక్షుడిగా తోటకూర హరికిషోర్‌బాబు, ఉపాధ్యక్షుడిగా అబ్దుల్ రహీం ఎన్నికయ్యారు. రొయ్యూరు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా జి.శ్రీనివాస ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా టి.మల్లికార్జునరావు ఎన్నికయ్యారు.

ఉయ్యూరు: కూటమి ఏకపక్ష ధోరణి, దౌర్జన్యపూరిత వైఖరిని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఎన్నికలను బహిష్కరించడంతో ఉయ్యూరు మండలంలోని సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. మండలంలోని ముదునూరు సంఘం అధ్యక్షుడుగా కలపాల ఫణి ప్రకాష్, ఉపాధ్యక్షుడిగా నీలపాల రాధాకృష్ణ, కలవపాముల సంఘానికి అధ్యక్షుడిగా వెల్లంకి రామమోహన్‌రావు, ఉపాధ్యక్షుడు కె.సత్యనారాయణ, సాయిపురంకు అధ్యక్షుడిగా తుమ్మల సురేష్, ఉపాధ్యక్షుడిగా గొరిపర్తి నాగేశ్వరరావు, పెద ఓగిరాలకు అధ్యక్షుడిగా గుంటక నాగిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా జి.సర్వేశ్వరరావు, ఉయ్యూరుకు అధ్యక్షుడిగా నాదెళ్ల యుగంధర్ ప్రసాద్, ఉపాధ్యక్షుడు కాసరనేని వెంకటేశ్వరరావు, కుందేరు సంఘానికి అధ్యక్షుడిగా గొరిపర్తి సాంబశివరావు, ఉపాధ్యక్షుడిగా రామిశెట్టి వెంకట నరసింహారావు ఎన్నికయ్యారు. తహసీల్దార్ సురేష్‌కుమార్ ఎన్నిక ప్రక్రియను పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల అధికారులు నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు.



ఉయ్యూరులో ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్ సురేష్‌కుమార్



ఈడుపుగల్లులో పోలింగ్ ప్రక్రియపై సమీక్ష చేస్తున్న ఇరిగేషన్ ఈఈ రవికిరణ్



పోరంకిలో రైతు బద్రీనారాయణ, ఎంపీడీవో ప్రణవి మధ్య వాగ్వాదం

గన్నవరం: మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. కేసరపల్లి సాగునీటి సంఘం అధ్యక్షుడు జాస్తి విజయభూషణ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా పల్లి ధర్మానందరావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఉంగుటూరు ఎంపీడీఓ ఈ. సత్యకుమార్ వ్యవహరించారు. ఎస్ఎస్‌పీ నీటి సంఘం అధ్యక్షుడిగా మద్దినేని కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా జొన్నలగడ్డ అశోక్‌కుమార్ ఎన్నికయ్యారు. మర్లపాలెం నీటి సంఘం అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కంభంపాటి బాబూరావు, బుద్దవరం-3 సాగునీటి సంఘం అధ్యక్షుడు కొసరాజు రాము, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసరావు ఎన్నికయ్యారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండల పరిధిలో 179 ప్రాదేశిక నియోజకవర్గాలు (టీసీ), 25 సాగునీటి సంఘాలు (డబ్ల్యూయూఏ) ఉండగా, 175 టీసీలు, 24 డబ్ల్యూయూఏ ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. మల్లవల్లి, రేమల్లే గ్రామాల్లో సాగునీటి సంఘం ఎన్నికల్లో హైడ్రామా సాగింది. టీడీపీ నుంచి రెండు వర్గాలు ఏర్పడ్డాయి. చివరికి ఆ పార్టీ నాయకులు నచ్చజెప్పడంతో అధ్యక్షుడి ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది.

కంకిపాడు: మండల పరిధిలో ఉప్పలూరు సంఘానికి అధ్యక్షుడిగా కనగాల సుబ్బారావు, ఉపాధ్యక్షుడిగా ఉడతా రామారావు ఎన్నికయ్యారు. వేల్పూరు సంఘానికి అధ్యక్షుడిగా పామర్తి లవకుమార్, ఉపాధ్యక్షుడిగా కన్నా రామయ్య, తెన్నేరు సంఘానికి అధ్యక్షుడిగా యార్లగడ్డ రాజారావు, ఉపాధ్యక్షుడిగా కొండేటి శ్రీనివాసరావు, కోలవెన్ను సంఘానికి అధ్యక్షుడిగా తుమ్మల జగదీష్, ఉపాధ్యాక్షుడిగా ఎస్.కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. గొడవర్రు సంఘానికి అధ్యక్షుడిగా యలమంచిలి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా దాడి శ్రీనివాసరావు, ఈడుపుగల్లు సంఘానికి అధ్యక్షుడిగా దేవినేని రత్నభూషణ్, ఉపాధ్యక్షుడిగా పిడికిటి సురేష్ ఎన్నుకోబడ్డారు. కోలవెన్ను సంఘానికి అధ్యక్షుడిగా పెరవలి సుబ్బారావు, ఉపాధ్యక్షుడిగా ఆరేపల్లి వెంకటేశ్వరరావు, కుందేరు సంఘానికి అధ్యక్షుడిగా కలకోట సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడిగా భీమవరపు స్వామిరెడ్డి ఎన్నికయ్యారు. ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాలలో పోలింగ్ ఏర్పాట్లపై ఇరిగేషన్ శాఖ కేసీ డివిజన్ ఈఈ ఆర్. రవికిరణ్ అధికారులతో సమీక్ష చేశారు.

గన్నవరం రూరల్: స్థానిక ఎంపీపీ పాఠశాలలో జరిగిన ఎన్నికల్లో మండలంలోని చిక్కవరం ఒద్దు చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా చిట్టినేని పాండు రంగారావు, ఉపాధ్యక్షుడిగా కొణతం మోహనరావు శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సూరంపల్లి ఎర్రచెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా కాటూరి దానియేలు, ఉపాధ్యక్షుడిగా తుల్లిమిల్లి తిరుపతి వెంకయ్య, తుమ్మల చెరువు అధ్యక్షుడిగా ఈలప్రోలు కొండలరావు, ఉపాధ్యక్షుడిగా గొడెం వాసు ఏకగ్రీవమయ్యారు.

ఉంగుటూరు: మండలంలోని ఏడు సాగునీటి సంఘాలు, 78టీసీలకు శనివారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో 74 టీసీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని, నాలుగు టీసీలకు ఎవరు పోటీ పడలేదని తహసీల్దార్ జె.విమలకుమారి తెలిపారు.

నున్న జంగమవాని చెరువు అధ్యక్షుడిగా కొరప్రోలు



కొరప్రోలు కృష్ణారెడ్డి

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామం జంగమవాని చెరువు సాగునీటి సంఘం ఎన్నికల్లో రైతు కొరప్రోలు కృష్ణారెడ్డి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. శనివారం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన ఎన్నికల్లో ఎన్నికల అధికారి గాలీషా అధ్యక్షుడి పదవికి టాస్ వేయగా కృష్ణారెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఢిల్లీ కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. బూరుగుల చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడు ఎం.వెంకటసుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడిగా కె. రమేష్, ఎస్ఎస్‌పీ కెనాల్ సంఘం అధ్యక్షుడిగా పి. శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా వై. బెనర్జీరెడ్డి ఎన్నికయ్యారు.

క్లుప్తంగా

ముగిసిన అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం



పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో గత కొద్ది రోజులుగా జరుగుతున్న 12-డే అడ్వాన్స్‌డ్ అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శనివారంతో ముగిసింది. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి మాట్లాడుతూ ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఏ డీప్ డ్రైవ్ ఇంటూ అటానమస్ వెహికల్స్ థియరీ టూ ప్రాక్టీస్‌పై అధ్యాపకులకు ప్రత్యేక శిక్షణ ఈనెల 2వ తేదీ నుంచి ఇచ్చామన్నారు. దేశంలో వివిధ ఐఐటీల్లో పని చేసే నిపుణులు, స్టేట్ యూనివర్సిటీ వక్తలు పాల్గొని వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారని తెలిపారు. వివిధ కాలేజీలకు చెందిన 50 మంది అధ్యాపకులు శిక్షణలో పాల్గొన్నారని తెలిపారు.

మెగా లోక్ అదాలత్

గన్నవరం: స్థానిక 8వ అదనపు ఫస్ట్‌క్లాస్ మెజిస్టేట్ కోర్టులో శనివారం మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి బీ శిరీష మాట్లాడుతూ రాజీకి ఆమోదయోగ్యమైన కేసులను కక్షిదారులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని చెప్పారు. దీనివల్ల కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. అనంతరం గన్నవరం, ఉంగుటూరు మండలాలకు చెందిన పలు కేసులను విచారించారు. స్థానిక సబ్‌కోర్టులో కూడా లోక్ అదాలత్ నిర్వహించారు.

ఆత్మీయ కలయిక



కంకిపాడు: వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తిని కానూరులోని ఆయన నివాసంలో ఆ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జి.ప్రణీత్‌కుమార్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చక్రవర్తిని సత్కరించారు. అనంతరం నియోజకవర్గంలోని సమస్యలపై వారు చర్చించారు.

భక్తిశ్రద్ధలతో శివలింగ ప్రతిష్ట



శివలింగాన్ని ప్రతిష్టిస్తున్న భక్తులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని పిన్నమనేని హైట్స్ అపార్టుమెంట్ ప్రాంగణంలో కార్తీకమాసంలో పూజలందుకున్న అమృతేశ్వరుడు (శివ లింగాన్ని) చిన ఆగిరిపల్లిలోని శ్రీ కృష్ణ దుర్గ సదర్మ సాదనా నిలయం రేణుకా క్షేత్రంలో శనివారం ప్రతిష్టించారు. ఆశ్రమ పీఠాధిపతి కృష్ణమ్మస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి ఉదయం 8.13 గంటల సమయంలో విగ్రహ ప్రతిష్ట వైభవంగా జరిగింది. కార్యక్రమ నిర్వాహకుడు కందిమళ్ల ఆంజనేయులు మాట్లాడుతూ శివలింగానికి కార్తీకమాసం పూర్తైయ్యే వరకు అభిషేకాలు, హోమాలు నిత్యపూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు తెలిపారు.

సోలార్‌తో ఇంధన పొదుపు సాధ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది

ఉయ్యూరు: సోలార్ వినియోగంతో ఇంధన పొదుపు సాధ్యమవుతుందని విద్యుత్ శాఖ ఈఈ కృష్ణనాయక్ అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఉయ్యూరులో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈఈ కృష్ణనాయక్ మాట్లాడుతూ విద్యుత్ పొదుపుపై ప్రజలు దృష్టిసారించాలన్నారు. సోలార్ వినియోగంతో విద్యుత్ ఆదా అవ్వడంతో పాటుగా ఆదాయం సమకూరుతుందన్నారు. పీఎం సూర్య ఘర్ పథకాన్ని వినియోగించుకోవాలని కోరారు. డీఈఈ హేమకుమార్, ఏఈలు బసవశాస్త్రులు, నాగేశ్వరరావు, దేవదాసు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా దినోత్సవాలు



క్రీడా జ్యోతి వెలిగిస్తున్న ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సెక్రటరీ డాక్టర్ కె.ప్రవీణ్

కంకిపాడు: ఈడుపుగల్లు నలంద విద్యానికేతన్ వసంతా క్యాంపస్‌లో క్రీడా దినోత్సవ వేడుకలు శనివారం ఉత్సాహంగా జరిగాయి. డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ డాక్టర్ పి.జాన్సన్ జాతీయ జెండా ఎగురవేశారు. క్రీడా జ్యోతిని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సెక్రటరీ డాక్టర్ కె.ప్రవీణ్ వెలిగించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ ఉన్నత స్థాయికి చేరుకున్న క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకుని క్రీడల్లో రాణించాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజయం సాధించిన దీక్ష హౌస్ టీంకు, హౌస్ మాస్టర్‌కు ట్రోఫీ, మెడల్స్ అందించారు. క్రీడా నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పోటీలను విద్యాసంస్థల అధినేత విజయ్‌బాబు, ప్రిన్సిపాల్ పి.నాగలక్ష్మి పర్యవేక్షించారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

ఉంగుటూరు: మండలంలోని పొట్టిపాడులో వస్వే మిషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక బెస్ట్ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఆ మిషన్ సెక్రటరి కొడాలి జోయల్, డైరెక్టర్ స్వర్ణలత మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేదల అభ్యున్నతికి వస్వే మిషన్ పలు రకాల సేవా కార్యక్రమాలు చేస్తోందన్నారు. శిబిరంలో 350మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందశారు. డాక్టర్లు పి.రవికుమార్, ప్రమీల జయంతి, జోత్స్న, మల్లేశ్వరి, ఇవాంజిలిస్ బ్లెస్సీ, వాహిని వైద్య సేవలు అందించారు.

గంగూరు చెరువులో చేపలు మృతి



పెనమలూరు: గంగూరు చేపల చెరువులో చేపలు మృత్యువు వాత పడుతున్నాయి. గ్రామంలో దాదాపు 10 ఎకరాల్లో చెరువు విస్తరించి ఉంది. అయితే చెరువు ఆక్రమణలకు గురవ్వడం, చెరువులో మురుగునీరు చేరి కలుషితంగా మారింది. అలాగే గుర్రపు డెక్క విపరీతంగా పెరిగడంతో చేపల కదలికకు సమస్యగా మారింది. కాగా చెరువులో చేపలు గత రెండు రోజులుగా చనిపోతున్నాయి. చెరువును ప్రక్షాళణ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. చెరువు ఇలాగే ఉంటే భవిష్యత్తులో చెరువు మనుగడ దెబ్బతింటుందని గ్రామస్తులు ఆందోళణ వ్యక్తం చేస్తున్నారు.

అందరి సహకారంతో సంక్రాంతి ఉత్సవాలు



గ్రామసభలో మాట్లాడుతున్న సీఐ పవన్ కిషోర్

రామవరప్పాడు: రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించే సంక్రాంతి ఉత్సవాలను ఈ ఏడాది కూడా ఎటువంటి ఆటంకాలు లేకుండా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని పటమట సీఐ పవన్ కిషోర్ కోరారు. విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు పేరంటాలమ్మ ఆలయంలో సంక్రాంతి ఉత్సవాల నిర్వహణకు శనివారం గ్రామ ప్రజలు, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాలు ప్రశాంతంగా జరగడానికి అవసరమైన సలహాలు, సూచనలు తీసుకున్నారు. సీఐ పవన్ కిషోర్ మాట్లాడుతూ జనవరి 13 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించే ఈ ఉత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసు కోకుండా పోలీసుల ప్రత్యేక నిఘా ఉంటుందన్నా రు. ఆలయ ఈఓ పి. ప్రియాంక మాట్లాడుతూ రూ ట్మ్యాప్ ప్రకారం అమ్మవారి గ్రామోత్సవం జరుగుతుందని తెలిపారు. ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించడానికి రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు. సమావేశంలో పేరంటాలమ్మ ఆలయ మాజీ ఛైర్మన్ బోయిన భానుప్రదీప్, గ్రామ మాజీ ఉపసర్పంచ్ కొల్లా ఆనంద్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ప్రభుత్వ స్థలం ఆక్రమణ

- అధికార పార్టీ నేతల అండతో కబ్జా
- చోద్యం చూస్తున్న అధికారులు



గోసాల వైకుంఠపురంలో ప్రభుత్వ స్థలంలో వెలసిన రేకుల షెడ్డు

పెనమలూరు: ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా రూ. కోటి విలువ చేసే ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురయింది. రాత్రికిరాత్రే ఓ వ్యక్తి ప్రభుత్వ స్థలంలో రేకుల షెడ్డుతో పాగా వేశాడు. అత్యంత విలువైన ప్రభుత్వ స్థలం కబ్జా జరుగుతున్నా నీటిపారుదల శాఖ అధికారులు కాని, రెవెన్యూ అధికారులు కాని నిమ్మకు నీరెత్తినట్లు ఉండటంతో స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. గోసాల వైకుంఠపురంలో ప్రభుత్వ నీటిపారుదల శాఖకు చెందిన బందరు కాలువ కట్ట స్థలం దాదాపు 15 సెంట్లకు పైగా ఉంది. దీనిపై టీడీపీ నేతల కన్ను పడింది. గత కొద్ది కాలం క్రితం ఈ విలువైన స్థలాన్ని ఆక్రమించడానికి యత్నించారు. అయితే ఆక్రమణలపై సాక్షిలో కథనం రావడంతో నీటిపారుదల శాఖ, రెవెన్యూ అధికారులు కదిలారు. ఆక్రమణలు అడ్డుకున్నారు. భవిష్యత్తులో ఆక్రమణలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు ప్రకటించారు.

విలువైన స్థలంలో షెడ్డు

దాదాపు రూ. కోటి విలువ చేసే స్థలం కబ్జాకు స్కెచ్ వేశారు. మరల ఆక్రమణదారులు విలువైన ప్రభుత్వ స్థలంలో శనివారం షెడ్డు వేశారు. అధికారులు ఎవరు స్పందించకపోవడంతో మిగితా స్థలాన్ని పూర్తిగా ఆక్రమించి ముక్కలు, ముక్కలుగా విక్రయించడానికి సన్నాహాలు చేపట్టారు. ఎంతో విలువైన స్థలాన్ని బాహాటంగా ఆక్రమించినా అధికారులు ఎవ్వరు చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ నేతలు బరితెగించి ఆక్రమణలకు తెగబడుతున్నా అధికారులు చేతులు కట్టుకుని ఉండటంపై సర్వత్రా విమర్శలు వెల్లెవెత్తుతున్నాయి. అధికారులు ఆక్రమణలు నిరోధించకపోతే తాము కూడా ఆక్రమణలకు దిగుతామని వైకుంఠపురం ప్రాంతం పేదలు చెబుతున్నారు. మరి ఈ వ్యవహారంపై అధికారుల స్పందన కోసం స్థానికులు ఎదురు చూస్తున్నారు.

గంబూసియా చేపలతో దోమల నిర్మూలన

కంకిపాడు: గంబూసియా చేపలతో దోమల నిర్మూలన సాధ్యమని మలేరియా సబ్ యూనిట్ అధికారి జీవీవీ శ్రీనివాసరావు అన్నారు. ఉప్పలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మురుగు కాలువల్లో దోమల నిర్మూలన చర్యల్లో భాగంగా గంబూసియా చేపల విడుదల కార్యక్రమం శనివారం చేపట్టారు. సర్పంచ్ లాం సోనియా మురుగు కాలువలు, నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో గంబూసియా చేపలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓలు శ్రీనివాసరావు, కృష్ణారావు, హెల్త్ అసిస్టెంట్ ఎస్‌జే కెనడీ, శ్రీధర్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

ఉంగుటూరు: తేలప్రోలు-నందమూరు ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. లంకపల్లి గ్రామానికి చెందిన పెరతోటి రాంబాబు(60) శనివారం ఉదయం టీవీఎస్ మోపెడ్‌పై ఉంగుటూరు వెళుతున్నాడు. అదే సమయంలో కొయ్యగూరపాడుకు చెందిన తాటిపాముల భార్గవ్ బైక్‌పై కంకిపాడు వెళుతున్నాడు. బుడమేరు వంతెన వద్ద ఎదురుగా వస్తున్న రాంబాబును బైక్‌తో ఢీకొట్టాడు. ఈ ఘటనలో వృద్ధుడి తలకు తీవ్రగాయం కావడంతో స్థానికులు సమీపంలోని ఉంగుటూరు పీహెచ్‌సీకి తరలించారు. చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందాడు. ఎస్ఐ గోవిందు కేసు నమోదు చేశారు.

వర్గీకరణ కుట్రను అడ్డుకుంటాం

పెనమలూరు: వర్గీకరణ పేరుతో జరుగుతున్న కుట్రను అఖిత భారత మాలల జేఏసీ అడ్డుకుంటుందని మాల మహానాడు జేఏసీ నేత, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పంతగాని రమేష్ అన్నారు. పెనమలూరులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా ఈ నెల 15వ తేదీన 'హలో మాల-చలో గుంటూరు'లో మాలల మహాగర్జన చేపట్టామని తెలిపారు. మాలలు పెద్ద సంఖ్యలో పాల్గొని సత్తాచాటాలని పిలుపునిచ్చారు.

క్రమశిక్షణతో ఉజ్వల భవిత

కంకిపాడు: క్రమశిక్షణతో ఉజ్వల భవిత సాధ్యమని విజయవాడ పీఠాధిపతి, బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు అన్నారు. కంకిపాడు పట్టణంలోని సెయింట్‌మేరీస్ హైస్కూల్ 38వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బిషప్ జోసఫ్ రాజారావు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, గేయాలు అలరించాయి. ప్రతిభా పోటీలు, విద్యలో సత్తాచాటిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు.

టైలరింగ్ షాపులు దగ్ధం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు వేమినేని రామస్వామి వీధిలో పక్కపక్కనే ఉన్న రెండు టైలరింగ్ షాపుల్లో శనివారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో రెండు షాపుల్లో కలిపి సుమారు రూ. 10లక్షలు ఆస్తి నష్టం వాటిల్లింది. బాధితుల కథనం మేరకు.. గ్రామంలోని ఆర్.కె అనుపమ టైలరింగ్ షాపులను యజమానులైన రంబా రమేష్, వేమినేని శ్రీనివాసరావులు గత కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి పని ముగించుకుని షాపులను మూసివేశారు. అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో ఆర్.కె టైలరింగ్ షాపులో తొలుత షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. మంటలు క్రమేణా పక్కనే ఉన్న అనుపమ టైలర్స్ షాపునకు కూడా వ్యాపించాయి. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో కుట్టు మిషన్లు, సామాగ్రి, కస్టమర్ల కొత్త దుస్తులు కాలి బూడిదయ్యాయి. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.